సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



రేపటి నుంచి మెస్‌లు రీఓపెన్

కేయూలోని వివిధ హాస్టళ్లు, మెస్‌లు రేపటి (సోమవారం) నుంచి రీఓపెన్ చేయనున్నట్లు హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

- 8లో▸



ఉడతా ఉడతా ఊచ్..

రఘునాథపల్లి మండలం మండెలగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని కెపాసిటర్ సెల్స్‌లోకి ఉడత చేరడంతో రూ.2లక్షల మేర నష్టం జరిగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
26^0 /29^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం నుంచి ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి



మహబూబాబాద్: రానున్న రెండు రోజులు అధికారులు, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన శనివారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలపై సమీక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేశ్ అన్ని మండలాల, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.

వాగుల ఉధృతి పరిశీలన

కొత్తగూడ: కుండపోత వర్షానికి మండలంలో పొంగిపొర్లుతున్న వాగులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ పరిశీలించారు. గుంజేడు వాగు, రాళ్లతెట్టె వాగు, మొండ్రాయిగూడెం వాగులను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ మిషన్ జనరేటర్ ఏర్పాటుకు కృషి



గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి అత్యవసరమైన స్కానింగ్ మిషన్, ఎలక్ట్రిక్ జనరేటర్, ఆక్సిజన్ ప్లాంట్ పరికాల ఏర్పాటుకు కృషి చేస్తానని సింగరేణి సంస్థ సీఎండీ (చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్) ఎన్ బలరాం (ఐఆర్ఎస్) హామీ ఇచ్చారు. శనివారం గార్లలోని సీహెచ్‌సీ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సీహెచ్‌సీ వైద్యుడు రాజ్‌కుమార్ జాదవ్ ఆస్పత్రికి కావాల్సిన అత్యవసర పరికరాల గురించి సీఎండీకి విన్నవించారు. ఈమేరకు సీఎండీ స్పందించి సింగరేణి సంస్థ తరఫున ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. సీఎండీ వెంట డాక్టర్ హనుమంతరావు, వైద్యసిబ్బంది ఆశా, బి.శ్రీనివాస్, లత, షాహిన్, ఉమ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు ప్రారంభం

గార్లలోని బంజారా సేవా సమితి పాఠశాలను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం సందర్శించారు. గతంలో సింగరేణి సంస్థ తరఫున నిర్మించిన 3 అదనపు తరగతి గదులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్న బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తే జావత్ జోగ్రాం నాయక్‌ను అభినందించారు. సీఎండీ వెంట ఇల్లందు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కృష్ణయ్య, సేనా, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి



కొండయ్య (ఫైల్)

పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన సుధగాని కొండయ్య(48) వ్యవసాయ బావిలో పడి శనివారం మృతి చెందాడు. బంధువు మృతి చెందగా.. భార్య స్వరూప కాన్వాయిగూడెం గ్రామానికి వెళ్లింది. ఉదయం పొలం పనుల కోసం వెళ్లిన కొండయ్య మధ్యాహ్నమైనా రాకపోవడంతో కూతురు అపర్ణ తండ్రికి ఫోన్ చేసింది. స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెతకగా.. వ్యవసాయ బావిలో కొండయ్య విగతజీవిగా కనిపించాడు. అతడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శనివారం నిర్వహించిన వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్–15,17 విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన వాలీబాల్ జట్టు ఈ నెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో, ఫుట్‌బాల్ క్రీడాకారులు 21, 22వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఉప్పొంగిన వాగులు

జిల్లాలో కుండపోత వర్షం

- నిలిచిన రాకపోకలు
- పలు గ్రామాల్లో ఇళ్లలోకి చేరిన వరద
- అస్తవ్యస్తమైన జనజీవనం

జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. ప్రధాన రహదారుల్లో లో లెవెల్ బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు రహదారులకు అడ్డంగా పడిపోయాయి. పంటలు నీటమునిగాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది.



గూడూరు నుంచి నెక్కొండ, కేసముద్రం మండలాలకు వెళ్లే మార్గంలో పాకాల వాగు ఉధృతి

కొత్తగూడ మండలంలో..



కొత్తగూడ: ఉప్పొంగి ప్రవహిస్తున్న గుంజేడు వాగు అవతలి వైపు నిలిచిన వాహనాలు

కొత్తగూడ మండలంలో నర్సంపేట నుంచి కొత్తగూడకు వచ్చే ప్రధాన రహదారిలో గుంజేడువాగు, గాదెవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పాకాల సరస్సు మత్తడి పోస్తుండడం ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈవైపు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడ నుంచి పొగుళ్లపల్లి వైపునకు వెళ్లే ప్రధాన రహదారిపై రాళ్లతెట్టెవాగు, ముస్మి నుంచి కర్నెగండికి వెళ్లే ప్రధాన రహదారిపై ముస్మివాగు, పొగుళ్లపల్లి నుంచి మొండ్రాయిగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై మొండ్రాయిగూడెం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా ఎస్సై రాజ్‌కుమార్ జీపీ సిబ్బందిని సమన్వయం చేసి వాగులకు అడ్డుగా ట్రాక్టర్లను ఉంచారు.

గూడూరు మండలంలో..

గూడూరు: గూడూరు నుంచి నెక్కొండ, కేసముద్రం మండలాలకు వెళ్లే మార్గంలోని పాకాలవాగు బ్రిడ్జిపై నుంచి వరద పొంగి పొర్లుతోంది. దీంతో ఏటి అవతలి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. గూడూరు బ్రాహ్మణపల్లి గ్రామల మధ్యలోని కోడి చెరువు అలుగుపోస్తోంది. అదే విధంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారికి అతిసమీపంలోని చెంద్రుగూడెంలోని ఓ ప్రధాన రహదారి జలమయమైంది. ప్రధాన వీధిలో సైడ్ కాల్వలు లేకపోవడం, వర్షపు నీరు వెళ్లే దిక్కు లేక దారిపొడవునా జలమయమైంది.

నీట మునిగిన పొలాలు



మహమూద్‌పట్నం గ్రామంలో నీటమునిగిన పంటపొలాలు

కేసముద్రం: మండలంలోని శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కురిసింది. దీంతో మహమూద్ పట్నం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పక్కనున్న, సుమారు 30 ఎకరాల పంటపొలాలు నీటమునిగాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో పెద్దకల్వర్టును నిర్మించక వరద నీరు పంటపొలాల్లో నిలుస్తోంది. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు మత్తళ్లు పోశాయి.

వర్షానికి దెబ్బతిన్న రోడ్డు ..



గుంత పక్క నుంచి నడుస్తూ వెళ్తున్న మహిళలు

గంగారం: గంగారం మండలంలోని నీలగండి ప్రాంతంలో భారీ వర్షానికి ప్రధాన రహదారిపై గుంత పడింది. మోరీ పైపులు వేసి రోడ్డు వేశారు. వరద ఉధృతికి మొత్తం గుంతమయం కావడంతో ఎస్సై రవికుమార్ స్పందించి ఆ వైపు రాకపోకలు సాగకుండా వాహనాలు అడ్డు పెట్టారు. రోడ్డు గుంతతో మండల కేంద్రానికి 10 గ్రామాల ప్రజలకు పూర్తి సంబంధాలు లేకుండా పోయాయి.

ప్రాణాలకు తెగించి.. వాగు దాటి

కొత్తగూడ: ప్రాణాలు కాపాడేందుకు ప్రాణాలకు తెగిస్తున్నారు 108 వాహన సిబ్బంది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని అన్ని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాహనాలు వాగులు దాటే పరిస్థితి లేదు. పొగుళ్లపల్లి గ్రామం నుంచి హై బీపీతో ఒకరు పక్షవాతం వచ్చే పరిస్థితి ఉందని 108కు ఫోన్ చేశారు. పైలెట్ గోవర్ధన్ పొగుళ్లపల్లికి వెళ్లేందుకు కొత్తగూడ దాటాడు. రాళ్లతెట్టె వాగు వరద ఉధృతంగా రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో అటు వైపు ఎలాంటి వాహనాలు వెళ్లకుండా అధికారులు చెక్ పోస్ట్ పెట్టి సిబ్బందిని కాపలా ఉంచారు. కొద్ది సేపు ఆలోచించిన పైలెట్ గోవర్ధన్ కాపల సిబ్బందిని ఒప్పించి ధైర్యంగా 108 వాహనాన్ని వాగు దాటించి రోగిని తీసుకొచ్చి ఆస్పత్రిలో చేర్పించాడు. 108 సిబ్బందికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



రాళ్లతెట్టె వాగు దాటి పొగుళ్లపల్లికి వెళ్తున్న 108 వాహనం

'మున్నేరు' ఉధృతం

డోర్నకల్: డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగు ఉధృతంగా పొంగిపొర్లుతోంది. మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో మున్నేరు వాగుకు వరద ప్రవాహం భారీగా పెరిగింది.



ఉప్పొంగి ప్రవహిస్తున్న మున్నేరువాగు

వెంకమ్మ చెరువుకు గండి

నర్సింహులపేట: మండలంలోని ముంగిమడుగులోని వెంకమ్మ చెరువుకు శనివారం గండి పడింది. వర్షానికి కుంటల నుంచి వరద రావడంతో వెంకమ్మ చెరువుకు గండి పడింది. చెరువులోని నీళ్ల సమీపంలోని ఆకేరు వాగులోకి వృథాగా పోతున్నాయి. సుమారుగా 100 ఎకరాలకు సాగు నీరు అందకుండా పోయింది.



ముంగిమడుగు చెరువుకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

అలుగుపోస్తున్న పర్వతగిరి చెరువు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలోని పెద్దచెరువు అలుగుపోస్తూ జలకళను సంతరించుకుంది. ఇటీవల కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పర్వతగిరి గ్రామ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వర్షపు నీరు వచ్చి స్థానిక చెరువులో కలుస్తుండగా.. చెరువు పూర్తిగా నీటితో నిండిపోయి అలుగుపోసే స్థాయికి చేరుకుంది.



12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

గార్ల: మండల కేంద్రమైన గార్ల నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీల కింద ఉన్న 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.



బయ్యారం మండలంలో..



బయ్యారం: మండలంలోని పందిపంపుల ప్రవాహంతో సుద్దరేవు–కంబాపల్లి గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. ఆ రెండు గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. బయ్యారం నుంచి ఇల్లందు వెళ్లే రహదారిపై నామాలపాడు సమీపంలోని జిన్నెలవర్రె నీరు రహదారిపైకి చేరడంతో వరంగల్–భద్రాచం నడుమ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సత్యనారాయణపురం–కోటగడ్డ గ్రామాల నడుమ అలిగేటి ప్రవాహంతో బ్రిడ్జి నీటమునిగింది.

ఎట్టకేలకు వరుణుడి కరుణ

- ఆలస్యంగానైనా పడుతున్న వర్షాలు.. లోటునుంచి ఎక్సెస్ వైపు వర్షపాతం
- ఉమ్మడి వరంగల్‌లో 25 మండలాల్లో అధికం.. 48 మండలాల్లో సాధారణం
- ఐదు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే..
- వర్ధన్నపేటలో అత్యధికం నమోదు.. రైతులకు ఊరట
- వానల ఆలస్యంతో తగ్గిన సాగు విస్తీర్ణం.. ఇప్పటివరకు 77.65 శాతమే

- సాక్షిప్రతినిధి, వరంగల్

- వివరాలు 8లో▸

యూరియా కోసం పడిగాపులు



మహబూబాబాద్ రూరల్: మానుకోట పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం గుమిగూడిన రైతులు



బయ్యారం: మన గ్రోమోర్ వద్ద చెప్పులను క్యూలో పెట్టిన రైతులు

- సరిపడా లేని నిల్వలు
- నిరాశతో వెనుదిరిగిన రైతులు

మహబూబాబాద్ రూరల్: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద శనివారం రైతులు యూరియా కోసం పడిగాపులుకాశారు. వందల సంఖ్యలో రైతులు రావడంతో తోపులాట జరిగింది. ఒక లారీలో 444 బస్తాల యూరియా రాగానే అందరికీ ఒక్కో బస్తా చొప్పున ఇస్తామని సొసైటీ అధికారులు చెప్పారు. ఎవరూ ఆగకపోవడంతో పీఏసీఎస్ ప్రధాన గేటుకు తాళం వేసుకుని వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న టౌన్ పోలీసులు రైతులతో మాట్లాడారు. లారీ యూరియా స్టాక్ అందరికీ సరిపోదని సోమవారం ఇస్తామని తేల్చి చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

క్యూలైన్‌లో చెప్పులు

కేసముద్రం: కొద్ది రోజులుగా స్టాక్ లేని యూరియా ధన్నసరి పీఏసీఎస్ సెంటర్ వద్దకు శనివారం వస్తుందనే సమాచారంతో రైతులు సెంటర్ వద్దకు చేరుకున్నారు. గోదాం తెరవకపోవడంతో చెప్పులను వరుస క్రమంలో ఉంచారు. వర్షం కారణంగా వరంగల్‌లో లారీ లోడింగ్ కాలేదని, యూరియా రాలేదని రైతులకు ఏఓ వెంకన్న చెప్పడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

240 బస్తాల కోసం వెయ్యి మంది రైతులు

బయ్యారం: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌కు 240 యూరియా బస్తాలు రావడంతో ఆ బస్తాల కోసం సుమారు వెయ్యి మంది రైతులు శనివారం మన గ్రోమోర్ కేంద్రం వచ్చారు. ఉదయం వచ్చిన రైతులు చెప్పులను క్యూలో ఉంచగా ఆ తరువాత తహసీల్దార్ నాగరాజు, ఎస్సై తిరుపతి రైతులతో మాట్లాడి వరుస క్రమంలో వచ్చిన రైతులకు అందుబాటులో ఉన్న యూరియాను ఇచ్చారు. రైతుందరికీ యూరియా అందలేదు.

అర్ధరాత్రి నుంచే ఎదురుచూపులు

గూడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎదుట శనివారం మండలానికి చెందిన సుమారు రెండు వేల మంది రైతులు యూరియా బస్తాల కోసం బారులుదీరారు. మండలంలోని కొన్ని దూరప్రాంతాలకు చెందిన మట్టెవాడ, ఊట్ల, నేలవంచ గ్రామాలకు చెందిన రైతులు అర్ధరాత్రి గూడూరుకు చేరుకొని స్థానిక వ్యాపార సంస్థల ముందర పడుకున్నట్లు సమాచారం. ఉదయం 5 గంటల నుంచే రైతులు ఒక్కసారిగా పీఏసీఎస్‌కు చేరుకొని క్యూలో నిలబడడంతో, సమాచారం అందుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని రైతులను క్యూలో నిలబెట్టారు. అనంతరం మండలంలోని పాకాల వాగు ఆవతలి గ్రామాలకు చెందిన అయోధ్యపురం, పొనుగోడు, రాములుతండ, గాజులగట్టు, గుండెంగ, బొల్లెపల్లి, నాయకపల్లి, తీగలవేణి గ్రామాలకు చెందిన రైతులు ప్రధాన రహదారిపై బారులుదీరారు. ఈసందర్భంగా మండల ఏఓ, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పీఏసీఎస్‌కు 40 టన్నుల యూరియా వచ్చినట్లు, వచ్చిన వారందరికీ ఒక్కొక్కటి చొప్పున అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: యూరియా కోసం రైతులు మండల కేంద్రంలోని గిడ్డంగి భవనం వద్ద శనివారం రైతులు ఉదయం 6 గంటల నుంచే పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకు ఎదిరి చూసిన రైతులకు అధికారులు యూరియా రావడంలేదని తెలపడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు.

19నుంచి ఎంఏ తెలుగు రెండో సెమిస్టర్ పరీక్షలు

హన్మకొండ కల్చరల్ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను రెగ్యులర్ ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19వ తేదీనుంచి 25వ తేదీవరకు నిర్వహిస్తున్నామని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99894 17299, 99891 39136 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

బీసీలు ఐక్యంగా ఉంటేనే రాజకీయ ఉన్నతి

- డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్
- మానుకోటలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు, ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే, ఎంపీ, తదితరులు

నెహ్రూసెంటర్: బీసీలంతా ఐక్యంగా ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఉన్నతి సాధించవచ్చని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి కురవి గేట్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని రామచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్య మురళినాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ మాలోత్ కవిత శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. బహుజనులను ఏకం చేసిన వీరుడు పాపన్నగౌడ్ అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంస్కృతీ, సంప్రదాయలను యువతరానికి తెలియజేస్తూ ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు. పార్టీలకతీతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ మాట్లాడుతూ.. బీసీల రాజ్యాధికారం కోసం, అందరూ ఐకమత్యంతో పోరాటాలు చేయాలన్నారు. గౌడన్నలు కాటమయ్య కిట్లను వినియోగించుకుని ప్రమాదాల నుంచి బయటపడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా సీఎం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలోగా గౌడ సంఘం కమ్యూనిటి హాల్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం..

సభలో ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చి మహబూబాబాద్, గార్ల, బయ్యారం, ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 50 లక్షలు చెల్లిస్తామని ప్రకటించారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల గౌడన్నలకు పింఛన్లు, ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ప్రమాద ఎక్స్‌గ్రేషియా రూ.12 కోట్లు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 5 ఎకరాల భూమిని ఈత, తాటి వనాల పెంపుకోసం ప్రభుత్వం కేటాయించేలా ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలన్నారు. సభలో తండ హరీశ్ రాసిన వంకతాటి పుస్తకాన్ని ఎమ్మెల్యే, ఎంపీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, గౌడ సంఘాల రాష్ట్ర నేతలు ఎంవీ రమణ, బొమ్మగాని ప్రభాకర్, పల్లె లక్ష్మణ్, రమేశ్, నాయకులు జెర్రిపోతుల వెంకన్న, ముత్యం వెంకన్న, బిక్కి వెంకటేశ్వర్లు, గునిగంటి కమలాకర్, చిత్తనూరి శ్రీనివాస్, నక్క నాగార్జున, ముంజాల రాజేందర్, గండి వీరేందర్, బండి దీపక్, నలమాస సాయి, తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, తదితరులు

భూ పరిహారం రూ.5 కోట్లు పెంచి ఇవ్వాలి

- ఎయిర్‌పోర్ట్ భూ బాధిత రైతుల ధర్నా



నెక్కొండ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ఖిలా వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.5 కోట్ల పరిహారం పెంచాలని, లేకపోతే భూమికి బదులు భూమి ఇవ్వాలని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు డిమాండ్ చేశారు.శనివారం వరంగల్–నెక్కొండ రోడ్డుపై గుంటూరుపల్లి వద్ద ఎయిర్‌పోర్ట్ భూ బాధిత రైతుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విలువైన భూమికి ఎకరానికి రూ.5కోట్ల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వేలో అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని, భూములను రీసర్వే చేసి పరిహారం పెంచి ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు కాలశ్రీ ప్రసాద్, కొత్తపల్లి భద్రయ్య, వంకటి శ్రీనివాస్, రత్తయ్య, సుబ్బారావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


జల సవ్వళ్లు..


గూడూరు: పాలనురగలా జాలువారుతున్న భీమునిపాదం


వాజేడు: బొగత ఎదుట పర్యాటకుల సందడి

- ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత, భీమునిపాదం
- పర్యాటకులను కనువిందు చేస్తున్న జలపాతాలు

వాజేడు/గూడూరు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత, మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ శివారులోని భీమునిపాద జలపాతాలు ఉధృతంగా జాలువారాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షంతో జలపాతాలకు పెద్ద ఎత్తున వరద వచ్చింది. ఫలితంగా ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేశాయి. ఎత్తైన గుట్టల నడుమ నుంచి జాలు వారుతూ పర్యాటకుల మనసును కట్టిపడేశాయి. కాగా, బొగత జలపాతం సందర్శనకు పర్యాటకులకు నిబంధన మేరకు అనుమతి ఇవ్వగా, భీమునిపాదం సందర్శనకు ఒక్క రోజు(శనివారం) అనుమతి ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఆదివారం నుంచి బొగత సందర్శనను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రేంజర్‌ చంద్రమౌళి తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా వెంకటాపురం సబ్‌ డివిజన్‌లోని అన్ని జలపాతాల సందర్శన పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు.


ఉధృతంగా మత్తడిపోస్తున్న పాకాల

పాకాల పరవళ్లు..

- పర్యాటకుల సందర్శన నిలిపివేత


పాకాలలో మూసివేసిన గేటు

ఖానాపురం: వరంగల్‌ జిల్లా ఖానాపురం మండలం పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. భారీ వర్షాలకు సరస్సులోకి చేరుతున్న నీటితో ఫీట్‌ ఎత్తుతో మత్తడిపోస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు భారీగా వస్తుండడంతో మత్తడి ఉధృతి మరింత పెరగనుంది. పర్యాటకులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా శనివారం పాకాల సందర్శన నిలిపివేశారు. సరస్సు వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై రఘుపతి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయించారు.

క్లుప్తంగా

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా వేణుగోపాల్‌



హన్మకొండ: సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ 375వ జయంతి ఉత్సవాల రాష్ట్ర కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి విద్యావేత్త, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌ గౌడ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్‌ గౌడ్‌ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న పాపన్న గౌడ్‌ జయంతి ఉత్సవాలకు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని గౌడ కులస్తులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైలు పట్టాలు దాటుతూ.. కానిస్టేబుల్‌ దుర్మరణం

- మానుకోటలో ఘటన


హరిప్రకాశ్‌(ఫైల్‌)

మహబూబాబాద్‌ రూరల్‌ : రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు ఓ పోలీస్‌ కానిస్టేబుల్‌ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై జె.సురేశ్‌ కథనం ప్రకారం.. జిల్లాలోని నర్సింహులపేట పోలీస్‌ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాలోత్‌ హరిప్రకాశ్‌ (40) ప్రస్తుతం తొర్రూరు సర్కిల్‌ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం వెళ్లి తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్‌ జిల్లా కేంద్రానికి చేరుకున్నాడు. రాత్రి సమయంలో పాత బజార్‌ నుంచి కొత్త బజార్‌ వైపునకు రావడానికి భవానీనగర్‌ తండా ప్రాంతం నుంచి నడుచుకుంటూ వచ్చి రైల్వే స్టేషన్‌లో ఆప్‌ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్‌ రైలు కింద నుంచి బయటకు దాటుతున్నాడు. అంతలోనే రైలు కదలడంతో కాలు విరిగి తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్‌ ఎస్సై సుభాని, జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని హరిప్రకాశ్‌ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. రైల్వే స్టేషన్‌ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు. మృతుడికి భార్య స్వాతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఎట్టకేలకు వరుణుడి కరుణ

- ఉమ్మడి వరంగల్‌లో 25 మండలాల్లో అధికం.. 48 మండలాల్లో సాధారణం
- ఐదు మండలాల్లో ఇంకా లోటువర్షపాతమే..
- వర్ధన్నపేటలో అత్యధికం నమోదు.. రైతులకు ఊరట
- వానల ఆలస్యంతో తగ్గిన సాగు విస్తీర్ణం.. ఇప్పటివరకు 77.65 శాతమే

ఆలస్యంగానైనా పడుతున్న వర్షాలు.. లోటునుంచి ఎక్సెస్‌ వైపు వర్షపాతం


మత్తడి పోస్తున్న వెంకటాపురం(ఎం) మండలం మారెడుగొండ చెరువు

సాక్షి ప్రతినిధి, వరంగల్‌ : వరుణుడి కరుణతో ఆలస్యంగానైనా వర్షాలు పడుతున్నాయి. ఈ వానాకాలం సీజన్‌ మేలో ముందస్తుగా తొలకరి జల్లులు మురిపించాయి. ఆ వర్షాలకు సాగుకు శ్రీకారం చుట్టిన రైతులు అత్యధికంగా పత్తి పంట వేశారు. ఆ తర్వాత జూన్‌ వరకు మేఘాలు ముఖం చాటేశాయి. జూలై రెండో వారంలో అక్కడక్కడ జల్లులు పడినా, అంతగా ప్రయోజనం లేకపోగా పత్తి విత్తనాలు రెండు సార్లు వేసినా ఎండిపోయాయి. పది రోజుల క్రితం వరకు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో లోటు వర్షపాతం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు కొంత ఊరట కలిగిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్‌ వ్యాప్తంగా 79 మండలాల్లో శనివారం ఉదయం 8:30 గంటల వరకు అధికారిక గణాంకాల ప్రకారం ఒక్క మండలంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. 25 మండలాల్లో అధికం, 48 మండలాల్లో సాధారణం, మరో ఐదు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదైంది.

సాగుపై వాన ప్రభావం.. తగ్గిన విస్తీర్ణం..

నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించడంతో తొలకరి జల్లులకే రైతులు సాగుబాట పట్టారు. ముందుస్తు వర్షాలు పడడంతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు నాటారు. అయితే ఆ తర్వాత సుమారు నెలన్నర అసలు వర్షాలే పడకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయాయి. దీంతో ఈ సారి ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో సాగు విస్తీర్ణం 77.65 శాతానికే పరిమితమైంది. వానాకాలంలో 15,82,755 ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. 12,41,456 ఎకరాల్లోనే సాగు చేశారు. గతేడాది వానాకాలంలో 110 శాతంగా సాగు విస్తీర్ణం ఉండగా.. ఈ సారి 77.65 శాతానికి పడిపోయింది. వరి, పత్తి సాగు కూడా గణనీయంగా తగ్గింది. ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు అంచనా 5,79,863 ఎకరాలు కాగా తాజా గణాంకాల ప్రకారం 4,98,109 (85.90 శాతం)లలోనే సాగు చేశారు. అలాగే, వరి సాగు అంచనా 8,78,376 ఎకరాలు కాగా, శనివారం నాటికి 6,14,320 (69.94 శాతం)గా సాగు విస్తీర్ణం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఇప్పటికీ ఐదు మండలాల్లో లోటు వర్షమే..

జూలై చివరినాటికి ఉమ్మడి జిల్లాలో 79 మండలాలకు గాను ఒక్క వర్ధన్నపేట మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 398.5 మి.మీ.లకు గాను 662.10 మి.మీ.ల (66 శాతం) అధికంగా పడింది. 25 మండలాల్లో సాధారణం కంటే 2 శాతం నుంచి 59 శాతం అధిక వర్షం కురిసింది. 48 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ములుగు, జయశంకర్‌ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వాగులు పొంగిపొర్లుతున్న ఆ జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది. లోటు వర్షపాతం ఉన్న మండలాల జాబితాలో ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం, వాజేడు, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాటారం, మహదేవపూర్‌, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలాలు ఉన్నాయి. మహబూబాబాద్‌ జిల్లాలో 18 మండలాలకు 8 మండలాల్లో అధికం కాగా, 10 మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది.

వరి సాగు ఇలా..

జిల్లా	సాగు అంచనా (ఎకరాల్లో..)	సాగైన విస్తీర్ణం
హనుమకొండ	1,41,984	1,13,011
వరంగల్‌	1,27,950	92,315
మహబూబాబాద్‌	2,03,909	1,49,808
ములుగు	99,628	59,833
జేఎస్‌ భూపాలపల్లి	1,08,106	66,217
జనగామ	1,96,799	1,33,136
మొత్తం	8,78,376	6,14,320

పత్తి ..

జిల్లా	సాగు అంచనా (ఎకరాల్లో..)	సాగైన విస్తీర్ణం
హనుమకొండ	92,028	74,849
వరంగల్‌	1,28,343	1,18,106
మహబూబాబాద్‌	89,219	78,745
ములుగు	24,513	19,431
జేఎస్‌ భూపాలపల్లి	99,948	98,260
జనగామ	1,45,812	1,08,718
మొత్తం	5,79,863	4,98,109

అత్యధిక, అధిక, లోటు వర్షపాతం ఉన్న మండలాల సంఖ్య ఇలా..

జిల్లా	మండలాలు	అత్యధిక	అధిక	సాధారణ	లోటు
హనుమకొండ	14	-	02	12	-
వరంగల్‌	13	01	08	04	-
మహబూబాబాద్‌	18	-	08	10	-
ములుగు	10	-	02	06	02
జనగామ	12	-	04	07	01
జేఎస్‌భూపాలపల్లి	12	-	01	09	02
మొత్తం	79	01	25	48	05

అనిశెట్టి రజిత సంస్మరణ సభ


రజిత సంస్మరణ సభలో కవులు, రచయితలు

హన్మకొండ కల్చరల్‌ : రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన కవయిత్రి, రచయిత్రి, సంపాదకురాలు అనిశెట్టి రజిత సంస్మరణ సభ నిర్వహించారు. శనివారం గోపాల్‌పూర్‌లో వేదిక సభ్యురాలు చందనాల సుమిత్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు, కవులు, రచయితలు హాజరై రజితకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ విశ్రాంతాచార్యుడు బన్న అయిలయ్య, అభ్యుదయ రచయిత సంఘం నేత నిధి బ్రహ్మచారి, కవి బిల్ల మహేందర్‌, ప్రజాఫ్రంట్‌నేత రమాదేవి, బిట్ల అంజనాదేవి, ఉదయశ్రీప్రభాకర్‌, ఇందిరా, డాక్టర్‌ బండారు సుజాత, వీఆర్‌ విద్యార్థి, రమేశ్‌, సింగరాజు రమాదేవి, పురుషోత్తం, శ్యామల, అశోక్‌, పద్మనాభం తదితరులు పాల్గొని రజిత ఉద్యమ సేవలను కొనియాడారు.

ఏడుబావుల వద్ద యువకుడి గల్లంతు

బయ్యారం: మహబూబాబాద్‌ జిల్లా గంగారం మండలం ఏడుబావుల వద్ద ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం ఎస్టీ కాలనీకి చెందిన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్‌ శనివారం బంధువులు, స్నేహితులతో కలిసి ఏడుబావుల జలపాతం చూసేందుకు వచ్చాడు. జలపాతం వద్ద పైనున్న బావులను చూసేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడినట్లు తెలుస్తోంది. వెంటనే సహచరులు ఎంత గాలించిన ప్రేమ్‌కుమార్‌ ఆచూకీ లభించలేదు. కాగా, చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది.



ఇందిరమ్మ ఇంటి పిల్లర్‌ గుంతలో పడి చిన్నారి మృతి

- మరో చిన్నారి ప్రాణాలు కాపాడిన స్థానికులు

బయ్యారం: మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలం జగత్‌రావుపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తీసిన పిల్లర్‌ గుంతలో పడి శనివారం ఓ చిన్నారి మృతిచెందగా మరో చిన్నారి ప్రాణాలతో బయటపడింది. గ్రామానికి చెందిన తేజావత్‌ బాబులాల్‌ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణం నిమిత్తం పిల్లర్‌గుంత తీశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరగా ఇంటి పక్కన నివసించే వాంకుడోత్‌ జగన్‌ కుమారుడు చక్రి(06) తేజావత్‌ సురేష్‌ కుమార్తె బుజ్జి(04) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడ్డారు. కొద్దిసేపటి తర్వాత గమనించిన స్థానికులు వెంటనే బుజ్జితోపాటు చక్రిని బయటకు తీసి మహబూబాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. వీరిలో చక్రి మృతి చెందగా బుజ్జి చికిత్స పొందుతోంది. చక్రి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.


మృతిచెందిన చక్రి


ప్రాణాలతో బయటపడిన బుజ్జి

మేడిగడ్డకు వరద తాకిడి..


పుష్కరఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి


సమ్మక్క సాగర్‌ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

- ఎగువ నుంచి 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కాళేశ్వరం వద్ద 8.300 మీటర్ల ఎత్తులో నీటిమట్టం

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరికి వరద పెరుగుతోంది. శనివారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదుల గుండా వరద పెరుగుతుండడంతో కాళేశ్వరం వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ వరద దిగువకు తరలుతోంది. దీంతో కాళేశ్వరం వద్ద 8.300 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మి)బ్యారేజీకి 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. ఆదివారం ఉదయం వరకు వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్‌ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లోకి రావొద్దు..

ఎగువ కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరదనీరు చేరుతుందని, ప్రజలు మహదేవపూర్‌ మండలం అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వైపు రావొద్దని, చేపల వేటకు వెళ్లద్దని ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్లు, పోలీసులు శనివారం హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోకి రావొద్దని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

పెరుగుతున్న గోదావరి ప్రవాహం

కన్నాయిగూడెం: మూడు రోజుల నుంచి మండలం తోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామం వద్ద ఉన్న సమ్మక్క సాగర్‌ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతోంది. రెండు రోజుల క్రితం బ్యారేజీలోకి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. శనివారం ఎగువన ఉన్న సరస్వతి, లక్ష్మి బ్యారేజీతోపాటు గోదావరిలోకి భారీగా నీరు చేరడంతో సమక్క సాగర్‌ బ్యారేజీలోకి 4,60,340 క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో బ్యారేజీ వద్ద ఉన్న 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 79.40 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది

సైన్స్‌ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలి

- టెక్నికల్‌ ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌ మల్లారెడ్డి


మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ సైన్స్‌ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలని టెక్నికల్‌ ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ పి. మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కేయూలోని సైన్స్‌, ఇంజనీరింగ్‌, ఫార్మసీ పరిశోధక విద్యార్థులతో ఫిజిక్స్‌ సెమినార్‌ హాల్‌లో తెలంగాణ సైన్స్‌ కాంగ్రెస్‌ సన్నాహక సమావేశం నిర్వహించగా మల్లారెడ్డి మాట్లాడారు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి సైంటిస్టులు, ఆచార్యులు, స్కాలర్లు విచ్చేస్తున్నారని, వారంతా అనేక అంశాల మీద పరిశోధనలు చేసి ఈ సైన్స్‌కాంగ్రెస్‌లో పేపర్ల ప్రజెంటేషన్లు, పోస్టర్ల ప్రజెంటేషన్లు ఇవ్వబోతున్నారన్నారు. మీ సబ్జెక్టులలో నిష్ణాతులైన ప్రొఫెసర్ల నుంచి రీసెర్చ్‌ ఏవిధంగా చేయాలో నేర్చుకోవాలన్నారు. కేయూ యూజీసీ కోఆర్డినేటర్‌ ఆర్‌. మల్లికార్జున్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్‌ ఎన్‌. ప్రసాద్‌ పలు సూచనలు చేశారు. తెలంగాణ సైన్స్‌ కాంగ్రెస్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ, ఫిజిక్స్‌ విభాగం ప్రొఫెసర్‌ బి. వెంకట్రామ్‌రెడ్డి క్యాంపస్‌లోని వివిధ సెమినార్‌హాళ్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, సైన్స్‌ కాంగ్రెస్‌ నిర్వహించబోయే ఆడిటోరియం పరిసరాల్లో కొందరు స్కాలర్లు శనివారం శ్రమదానం నిర్వహించారు.

ఉడతా ఉడతా ఊచ్‌.. రూ.2లక్షల ఆస్తి ఊస్ట్‌..


కెపాసిటర్‌ సెల్స్‌లోకి దూరి మృతి చెందిన ఉడుత


కాలిన ప్యానల్‌ బోర్డు

రఘునాథపల్లి: ఉడతతో రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందంటే నమ్మశక్యంగా లేదుకదా.. కానీ వాస్తవం. అంతేకాదు.. పలు గ్రామాలకు నాలుగు గంటలపాటు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండెలగూడెం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లోని కెపాసిటర్‌ సెల్స్‌లోకి ఉడుత చేరడంతో షార్ట్‌ సర్క్యూట్‌ జరిగింది. మంటలు చెలరేగి ఉడుత మృతిచెందడంతో పాటు రెండు కెపాసిటర్‌ సెల్స్‌, కెపాసిటర్‌ ప్యానల్‌ బోర్డు, రెండు బ్యాటరీ చార్జర్లు, రెండు రిలేలు, 20 మీటర్ల బ్రేకర్స్‌ కేబుల్‌ కాలిపోయాయి. దీంతో సబ్‌స్టేషన్‌ పరిధిలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకుని జనగామ నుంచి వచ్చిన ఎంఆర్‌టీ, టీఆర్‌ఈ బృందాలు దాదాపు మూడున్నర గంటలపాటు శ్రమించి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించారు. ఉడుత కెపాసిటర్‌ సెల్స్‌లోకి దూరడంతో రూ. 2 లక్షల మేర నష్టం జరిగినట్లు గుర్తించారు. అరె.. ఉడత ఎంత పనిచేశావ్‌ అంటూ గొణుక్కోవడం విద్యుత్‌ సిబ్బంది వంతైంది.

రేపటి నుంచి హాస్టళ్లు, మెస్‌లు రీఓపెన్‌

- నేటితో ముగియనున్న షార్ట్‌టర్మ్‌ సెలవులు

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ హాస్టళ్లు, మెస్‌లు రేపటి (ఈనెల 18) నుంచి రీఓపెన్‌ చేయనున్నట్లు హాస్టళ్ల డైరెక్టర్‌ ఎల్‌.పి.రాజ్‌కుమార్‌ శనివారం తెలిపారు. పీజీ, తదితర కోర్సుల విద్యార్థులకు ఇటీవల అధికారులు షార్ట్‌టర్మ్‌ సెలవులు ఇచ్చిన విషయం విధితమే. కామన్‌మెస్‌, మహిళా హాస్టల్‌ మెస్‌, ఇంజనీరింగ్‌ హాస్టల్‌ మెస్‌ మూసివేశారు. సుబేదారిలోని యూనివర్సిటీ 'లా' హాస్టల్‌, మెస్‌ యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం మూడో సెమిస్టర్‌లోకి ప్రవేశించిన యూనివర్సిటీ క్యాంపస్‌ కాలేజీ, యూనివర్సిటీ పీజీ కాలేజీల విద్యార్థులు తమ కాలేజీల్లో రెన్యువల్‌ చేసుకోవాల్సింటుంది. అలాగే, హాస్టల్‌ వసతి, మెస్‌ సదుపాయం పొందేందుకు కూడా హాస్టల్‌ ఆఫీస్‌లో రెన్యువల్‌ చేసుకోవాల్సింటుంది. రెన్యువల్‌ చేసుకున్నవారికే హాస్టల్‌ వసతి, మెస్‌ సదుపాయం కల్పించనున్నామని డైరెక్టర్‌ రాజ్‌కుమార్‌ తెలిపారు.

బాయ్స్‌ హాస్టల్‌, మెస్‌ కోసం రెన్యువల్‌ చేసుకోవాల్సిన వారి సంఖ్య ఇలా..

యూనివర్సిటీ కాలేజీలోని పీజీ కోర్సుల విద్యార్థులు (బాయ్స్‌) 456 మంది, బీఈడీ, ఎంఈడీ 48, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ 39, ఫార్మసీ 73, ఎస్‌డీఎల్‌సీఈ ఎంసీఏ, ఎంబీఏ 45 మంది, కామర్స్‌ 81, పీజీ కాలేజీ 49, ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌కాలేజీ 45, యూనివర్సిటీ 'లా' కాలేజీ 61మంది రెన్యువల్‌ చేసుకోవాల్సి ఉంటుంది.

మహిళా హాస్టల్‌, మెస్‌కోసం రెన్యువల్‌ చేసుకునే వారి సంఖ్య ఇలా..

యూనివర్సిటీ పీజీ కోర్సుల విద్యార్థినులు 555 మంది, బీఈడీ, ఎంఈడీ 21, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ 39, ఫార్మసీ 109, ఎస్‌డీఎల్‌సీఈ ఎంసీఏ,ఎంబీఏ 25 ,కామర్స్‌ 64, యూనివర్సిటీ 'లా' కాలేజీ 45, సుబేదారి పీజీ కాలేజీ 70, ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ 51మంది ఉన్నారు. రెన్యువల్‌కు ఒక్కో విద్యార్థి రూ. వెయ్యి చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డైరెక్టర్‌ రాజ్‌కుమార్‌ తెలిపారు.